# పరిచయము

"క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" అనునది క్రొత్త నిబంధన ప్రబోధము యొక్క ప్రధానాంశమై యున్నది! పెంతెకొస్తు దినాన, పేతురు యేసు గూర్చి బోధించుచు, "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన ఈయనను [యేసును], మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి ..." అని వినుచుండిన ప్రేక్షకులకు ప్రకటన చేసాడు (అపొస్తలుల కార్యములు 2:23; వచనం 36; 3:14, 15 చూడుము). పౌలు ఎక్కడెక్కడ బోధించుచుండినను – కొరింథులో (1 కొరింథీయులకు 1:23; 2:2), పిసిదియలోని అంతియొకయలో (అపొస్తులుల కార్యములు 13:14, 26-31), ఏథెన్సులో (అపొస్తులుల కార్యములు 17:30, 31) – ఆయన "క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" బోధించాడు. కొరింథులో నున్న సంఘమునకు, పౌలు ఇలా వ్రాసాడు,

> సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి. "ఇందు విషయమై జ్ఞానుల జ్ఞానమును నాశనము చేతును. వివేకులు వివేకమును శూన్యపరతును అని వ్రాయబడియున్నది." జ్ఞాని యేమయ్యెను? శాస్త్రి యేమయ్యెను? ఈ లోకపు తర్కవాది యేమయ్యెను? ఈలోక జ్ఞానమును దేవుడు వెఱ్ఱితనముగా చేసియున్నాడు గదా? దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరగకుండినందున, సువార్త ప్రకటనయను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను. యూదులు సూచక క్రియలు చేయుమని అడుగుచున్నారు, గ్రీసుదేశస్థులు జ్ఞానము వెదకుచున్నారు. అయితే *మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము.* ఆయన యూదులకు ఆటంకముగాను అన్యజనులకు వెఱ్ఱితనముగా ఉన్నాడు; గాని యూదులకేమి, గ్రీసుదేశస్థులకేమి, పిలవబడినవారికే క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునై యున్నాడు. దేవుని వెఱ్ఱితనము మనుష్యజ్ఞానముకంటె జ్ఞానముగలది, దేవుని బలహీనత మనుష్యుల బలముకంటె బలమైనది.
>
> సహోదరులారా, మిమ్మును పిలిచిన పిలుపును చూడుడి. మీలో లోకరీతిని జ్ఞానులైనను, ఘనులైనను, గొప్పవంశమువారైనను అనేకులు పిలవబడలేదు గాని ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండనట్లు, జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో నుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. ఎన్నికైనవారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింపబడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తుయేసునందున్నారు. అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను అని వ్రాయబడినది నెరవేరుసట్లు దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను. సహోదరులారా, *నేను మీయొద్దకు వచ్చినప్పుడు వాక్చాతుర్యముతో గాని జ్ఞానాతిశయముతో గాని దేవుని మర్మమును మీకు ప్రకటింప వచ్చినవాడను కాను. నేను, యేసు క్రీస్తు అనగా, సిలువవేయబడిన యేసు క్రీస్తును తప్ప, మరిదేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని"* (1 కొరింథీయులకు 1:18-2:2; నొక్కిచెప్పింది నేను).

"క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" అనునది ఈ రోజుల్లో కూడా మన ప్రసంగములకు కేంద్రమై యుండవలెను! అతి తరుచుగా, క్రీస్తు మరియు ఆయన సిలువను గూర్చిన

సందేశము తక్కువ స్థాయికి నెట్టివేయబడినదై యుంటున్నది. క్రీస్తును బోధించునప్పుడు, బోధకులు కొంత తత్త్వశాస్త్రమును, కొంచెము దేశభక్తిని, కొన్ని రాజకీయాలు, కొంచము వినోదమును ప్రత్యామ్నాయముగా చేసారు. ఏది ఏమైనా, క్రొత్త నిబంధన ప్రమాణమునకు యథార్థంగా ఉండవలెనంటే, "క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" అను అంశము సువార్త బోధలలో – కేవలము పైపైన గాకుండా – ప్రధానాంశమై యుండవలెను!

"క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" ప్రకటించుట అనగా అర్థమేమిటి? అనగా యేసు యొక్క జీవితము మరియు మరణమును గూర్చిన కథ చెప్పుట అని అర్థం, కానీ అది దానిని మించినదై యున్నది. క్రీస్తుకు సంబంధించినదానంతటిని బోధించుటయని అర్థం. ఈ బోధలో మనకు ఆయన మరణము మరియు ఆయన తిరిగి వచ్చుటకు సంబందించిన ప్రవచనంను గుర్తుచేయునవి, ప్రభు బోజన సంస్కారము గూర్చిన పాఠములు ఉంటున్నవి. అది బాప్తిస్మము గూర్చిన ఆదేశములను వివరించుచున్నది, ఏలయనగా బాప్తిస్మములో మనము క్రీస్తుతో కూడా ఏకమగుదము (రోమీయులకు 6:3, 4). దీనిలో సంఘమును గూర్చిన బోధ చేర్చబడి యుండవలెను, ఏలయనగా క్రీస్తు సంఘమును ప్రేమించి ఆమె కొరకు మరణించాడు, ఆమెను తన స్వరక్తమిచ్చి కొన్నాడు (అపొస్తలుల కార్యములు 20:28). క్రీస్తును ప్రకటించుట అనగా ఆయన ఏయే సంగతులు బోధించాడో ఆయన ఎలా జీవించాడో ఆ విషయాలను ప్రజలకు తెలియజెప్పుట అని కూడా అర్థమై యున్నది ఏలయనగా ఆయన చూపిన మాదిరి మరియు ఆయన చేసిన బోధలు ఆయన శిష్యులకు ఈ యుగమందంతటను మార్గనిర్దేశనములై యుండవలెనని ఉద్దేశించాడు. సంక్షిప్తంగా చెప్పుకొంటే, "క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" ప్రకటించుట అనగా క్రొత్త నిబంధన మొత్తమును బోధించుట అని అర్థము, ఎందుకనగా ఈ నిబంధన క్రీస్తు రక్తముతో ప్రతిష్ఠింపబడినది (మత్తయి 26:28).

ఈ క్రింది అధ్యయనము "క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" ప్రకటించుచున్నది. ఈ పాఠములు యేసు మరియు ఆయన సిలువ మరణమును గూర్చిన కథను తెలియజెప్పుచున్నవి, కానీ అవి అంతటితో అగిపోవుటలేదు. మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి బైబిలులోని అనేక సత్యములను నివేదించుటతోపాటు, మనము ఈ సత్యములను నేడు మన జీవితములలో అన్వయింపజేసికొనగల మార్గములను కూడా మనకు చూపించుచున్నవి.